
సాక్షి నంద్యాల

సోమవారం । 29 । ఏప్రిల్ । 2024



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం శాస్త్రోక్తంగా పల్లకీ సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



మల్లన్నకు నృత్యార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై కాకినాడకు చెందిన వాగ్దేవి నృత్యాలయ నికేతన్ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



.. పాపం చంద్రబాబుదే!

అలగనూరు రిజర్వాయర్‌ను పటిష్ట పరచకుండా టీడీపీ అధినేత చంద్రబాబు నిర్లక్ష్యం చేశారు. దీంతో కరకట్ట దెబ్బతిని రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

పోలింగ్ అధికారుల రెండవ దశ ర్యాండమైజేషన్ పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: జిల్లాలో జరిగే సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది రెండవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకులు పంకజ్ కుమార్, అన్నవి దినేష్ కుమార్, పోలీస్ అబ్జర్వర్ హిమాన్ను శంకర్ త్రివేది, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ ఈ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,711 పోలింగ్ కేంద్రాలకు పరిశీలకుల సమక్షంలో పోలింగ్ సిబ్బందిని అసెంబ్లీ నియోజకవర్గాలకు కేటాయిస్తూ రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేశామన్నారు. ఎన్‌ఐసీ రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తూ ఆన్‌లైన్‌లో ఈ ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలను 115 శాతం బఫర్‌తో, మైక్రో పరిశీలకులను 120 శాతం బఫర్‌తో సిబ్బంది కేటాయింపు ప్రక్రియ చేపట్టామన్నారు. మొదటి ర్యాండమైజేషన్ ద్వారా పూర్తయిన పోలింగ్ సిబ్బందికి నియామక లెటర్‌లు ఇవ్వడంతో పాటు ఈ నెల 15, 16 తేదీలలో క్లాస్ రూమ్ తరహాలో శిక్షణ తరగతులు కూడా నిర్వహించామని వివరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ వర్కర్స్‌ను ఓపీఓలుగా నియమిస్తూ వారిని రిజర్వులో ఉంచడం జరిగిందన్నారు.

శ్రీమఠంలో దేవదాయశాఖ కమిషనర్

మంత్రాలయం: రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదివారం మంత్రాలయం వచ్చారు. గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన చేశారు. రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేపట్టారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాఘవేంద్రుల జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల పూల మంత్రాక్షింతలతో ఆశీర్వచనాలు చేశారు. మంత్రాలయం క్షేత్రంలో కట్టడాలపై కమిషనర్ సంతృప్తి వ్యక్తం పరిచారు. ఆయనతోపాటు డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, మఠం ఏఏవో మాధవశెట్టి ఉన్నారు.

ఏపీసెట్‌కు 82 శాతం హాజరు

కర్నూలు కల్చరల్: విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలల అధ్యాపకుల అర్హత పరీక్ష ఏపీ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ -2024 ఆదివారం ప్రశాంతంగా జరిగింది. కర్నూలులోని తొమ్మిది కేంద్రాల్లో 3,883 మందికిగాను 3,172 (82 శాతం) మంది హాజరయ్యారని, 711 మంది గైర్హాజరయ్యారని ఏపీసెట్ రీజినల్ కో ఆర్డినేటర్, రాయలసీమ యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.టి.కె.నాయక్ తెలిపారు. రీజినల్ కోఆర్డినేటర్‌తో పాటు ఏపీ సెట్ స్పెషల్ అబ్జర్వర్, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

తూడిచెర్లలో ప్రబలిన అతిసార వ్యాధి



బాధితుల వివరాలు తెలుసుకుంటున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ

జూపాడుబంగ్లా: తూడిచెర్ల గ్రామంలో అతిసార వ్యాధి ప్రబలడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన 100 మందికి వాంతులు, విరేచనాలు కావడంతో వారు కర్నూలు, నందికొట్కూరు, ఆత్మకూరు ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గ్రామానికి చెందిన మధు, రాజు, సోమశేఖర్, పుసులూరయ్య కుటుంబ సభ్యులతో పాటు మరో 100 మందికి వాంతులు విరేచనాలు అయినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. విషయం తెలుసుకొన్న పారుమంచాల ప్రాథమిక వైద్యాధికారిణి యశశ్విని తన సిబ్బందితో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద వైద్యశిబిరాన్ని నిర్వహించి బాధితులకు చికిత్స నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ హుటాహుటినా తూడిచెర్లకు చేరుకొని పరిస్థితిపై వైద్యులు, వైద్యసిబ్బందితో ఆరా తీశారు. గ్రామంలోని తాగునీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించటంతో పాటు బాధితులకు 24గంటల పాటు వైద్యసేవలు నిర్వహించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.

వారధి నిర్మించి.. ఊరిని నెలబెట్టి



ఇక్కడ కనిపిస్తున్నది వనిపెంట చెంచుగూడెం బ్రిడ్జి. ఈ గ్రామం నుంచి పక్కనున్న పంచాయతీ వెళ్లాలంటే బవనాసి వాగు దాటాల్సిందే. లేదా 40 కి.మీ అడవిలో నడిచి వైఎస్సార్ జిల్లాలోని రోడ్డు మీదకు వెళ్లి మరో 70 కి.మీ బస్సులో ప్రయాణించాలి. దీంతో ఏడాదిలో ఆరు నెలలు కాలు బయట పెట్టలేని దుస్థితి. 60 ఏళ్లుగా ఎన్నికల సమయంలో బ్రిడ్జి కట్టిస్తామని నేతలు ఓట్లు వేయించుకోవడం అనంతరం ముఖం చాటేసేవారు. కొన్నిసార్లు బ్రిడ్జి నిర్మించేందుకు పెట్టే ఖర్చులో సగం అయితే వాగుకు ఇవలి పక్కన కొత్త ఊరు నిర్మించుకోవచ్చని, ఇటు పక్కకు రండి అని ఉచిత సలహా ఇస్తుండేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సమస్యకు పరిష్కారం లభించింది.రూ 4.80 కోట్లతో బ్రిడ్జి నిర్మించారు. 'నా జీవితంలో మా ఊరికి బ్రిడ్జి నిర్మిస్తారు. మేము ఆటోల్లో, మోటర్‌సైకిళ్లపై తిరుగుతామని అనుకోలేదు' అని గ్రామ నివాసి లక్ష్మీదేవి ఆనందం వ్యక్తం చేస్తోంది.



'దారి'ద్ర్యం తొలగింది



దొర్నిపాడు మండలం వెంకటేశ్వర నగర్ గ్రామం 70 సంవత్సరాల క్రితం ఏర్పడింది. గ్రామం నుంచి ప్రధాన రహదారిపైకి వచ్చి బస్సు ఎక్కాలంటే చుట్టూ కనీసం 4 కి.మీ చేను గట్లు తప్ప వేరే దారిలేదు. అత్యవసర ప్రయాణమంటే ఎద్దుల బండే గతి. ఇక్కడ నివాసం ఉన్న అందరూ కృష్ణ, ప్రకాశం జిల్లాల పరిధిలోని కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు. అయినా టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కనీసం మట్టి రోడ్డు కూడా నిర్మించలేదు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మండల కేంద్రం దొర్నిపాడు నుంచి రూ. 227 లక్షలతో 4 కి.మీ మేర బీటీ రోడ్డు నిర్మించారు. 'గతంలో రోడ్డు సౌకర్యం లేక అనేక కుటుంబాలు పొలాలు కౌలుకు ఇచ్చి పట్టణాలకు వెళ్లి పోయారు. ఇన్నాళ్లకు మా ఊరుకు రోడ్డు వేయడం సంతోషంగా ఉంది' అని గ్రామానికి చెందిన సత్యనారాయణ హర్షం వ్యక్తం చేస్తున్నారు.



20 ఏళ్ల తర్వాత..



నియోజకవర్గంలో ప్రధాన నీటి వనరు తెలుగుగంగ కాలువ. ఈ నీటితో దాదాపు లక్ష ఎకరాలు సాగు అవుతుంది. అయితే సుమారు 20 ఏళ్లుగా కాలువ మరమ్మతులు లేక ప్రధాన కాల్వలు, డైవర్షన్ చానళ్లు, డిస్ట్రిబ్యూటరీ కాల్వల పరిస్థితి దయనీయంగా మారింది. సమస్యను ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో రూ. 20 కోట్లు నిధులు మంజూరయ్యాయి. 21 బ్లాక్ నుంచి 37వ బ్లాక్ వరకు మరమ్మతులు చేపట్టడంతో ప్రస్తుతం సాగునీరు చివరి ఆయకట్టు వరకు అందుతోంది. గతంలో నీటి కోసం రాత్రిళ్లు మట్టి సంచులు అడ్డంగా వేసుకుంటూ చాలా ఇబ్బంది పడేవారమని ఇప్పుడు నీరు పుష్కలంగా పారుతోందని రైతు మోహన్‌రెడ్డి చెబుతున్నారు.



అదిగదిగో అభివృద్ధి

ఐదేళ్లలో రూపురేఖలు మారిన ఆళ్లగడ్డ నియోజకవర్గం

- సుమారు రూ. 1,600 కోట్లతో అభివృద్ధి పనులు
- కొత్తగా సమకూరిన మౌలిక సదుపాయాలు
- దశాబ్దాల నాటి సమస్యలు పరిష్కారం
- ప్రతి ఇంటా 'నవరత్న' పథకాల వెలుగులు

సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దక్షత.. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పట్టుదలతో శిల్పాల గడ్డ ఆళ్లగడ్డ అభివృద్ధికి అడ్డాగా మారింది. ఒకప్పుడు ఫ్యాక్షన్ ప్రాంతంగా అట్టుడికిన ఈ నియోజకవర్గంలో ప్రస్తుతం ప్రగతి పరుగులు పెడుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో దాదాపు ఏడు దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారమయ్యాయి. నవరత్నాలతో ప్రతి ఇంట వెలుగులు విరజిమ్మగా.. ప్రతి ఊరిలో అభివృద్ధికి నిదర్శనంగా ఎన్నో కనిపిస్తున్నాయి. రోడ్లు, డ్రైన్లు, తాగునీటి తదితర సదుపాయలు మొదలుకొని కేసీ, తెలుగుగంగ కాల్వల మరమ్మతులు చేయించడం, అగ్రి ల్యాబ్ వంటి ఆధునిక సౌకర్యాలను రైతులకు అందుబాటులోకి తెచ్చారు. ఊరూరా సచివాలయాలు, ఆర్‌బీకే కేంద్రాలు, హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మించడంతో సేవలు ప్రజలకు చేరువయ్యాయి. ప్రభుత్వ డిగ్రీ, ఐటీఐ కళాశాలల ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి ఊతం కల్పించారు. ఈ ఐదేళ్లలో దాదాపు 31 సంక్షేమ పథకాల కింద 1,61,118 కుటుంబాలకు రూ. 1,670.84 కోట్ల ప్రయోజనం చేకూరింది.



– ఆళ్లగడ్డ



కళాశాల సాకారం

నాడు–నేడు పనుల్లో రూ. 40 కోట్లతో ప్రభుత్వ విద్యాలయాలను అభివృద్ధి చేశారు. అలాగే ఎన్నో ఏళ్లుగా విద్యార్థుల కలగా ఉన్న ఆళ్లగడ్డలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సాకారమైంది. కళాశాల మంజూరు చేయడంతో పాటు అందులో అవసరమైన రెగ్యులర్ పోస్టులు, భవన నిర్మాణానికి రూ 2. కోట్ల నిధులు కూడా విడుదల చేశారు. దీంతో పాటు చాగలమర్రి మండలం పెద్దవంగళి సమీపంలో రూ. 4 కోట్లతో నూతన ఐటీఐ కళాశాల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. డిగ్రీ కళాశాల అందుబాటులోకి రావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నిర్మాణంలో ఉన్న ఐటీఐ కళాశాల భవనం

అను'గృహం'

ఆళ్లగడ్డ పట్టణంలో 1,394 టిడ్కో ఇల్లు అన్ని వసతులు, సౌకర్యాలతో నిర్మించి లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ఇందుకు సుమారు రూ 1,390 కోట్ల మేర ఖర్చు చేయడం జరిగింది. దీంతో పాటు నియోజకవర్గంలో 9.500 మందికి ఇంటి పట్టాలు ఇచ్చి పక్కా ఇళ్లు మంజూరు చేశారు. వీటి విలువ మార్కెట్‌లో సుమారు రూ. 15 కోట్లు ఉంటుంది. జగనన్న కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యాలకు అదనంగా ఖర్చు చేశారు.





క్రీడల్లో రాణించేలా..

పట్టణం రోజురోజుకు అభివృద్ధి చెందుతున్నా యువత క్రీడల్లో రాణించేలా ఇండోర్ స్టేడియం లేక ఇబ్బంది పడుతున్నారు. ఇది గమనించిన ప్రభుత్వం రూ. కోటి నిధులతో ఇండోర్ స్టేడియం మంజూరు చేయించి నెలలోపే నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించి అందుబాటులోకి తీసుకొచ్చింది.



ప్రజారోగ్యానికి భరోసా

ఒకప్పుడు ఏమాత్రం అనారోగ్యం వచ్చినా స్పెషలిస్ట్ డాక్టర్లకు చూయించుకోవాలంటే 40 కి.మీ దూరంలో ఉన్న నంద్యాల, ప్రొద్దుటూరు పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి చొరవతో 30 పడకల ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా రూ. 12 కోట్లతో ఆధునికీకరించారు. నూతన భవనాలు నిర్మించారు. అత్యాధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఏడుగురు స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించారు. పట్టణంలో రూ. 80 లక్షలతో అర్బన్ హెల్త్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఫ్యాక్షన్‌ను ఉసిగొల్పేందుకు వచ్చారా?



లక్ష్మీతండాలో అక్కాచెల్లెమ్మలకు అభివాదం చేస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

- డోన్ నియోజకవర్గాన్ని ప్రశాంతంగా ఉండనివ్వరా?
- ఏ గ్రామానికి వెళ్లినా మీ ఫ్యాక్షన్ బాధితులే కనిపిస్తారు
- కోట్లపై మంత్రి బుగ్గన మండిపాటు

ప్యాపిలి: ఐదేళ్ల పాటు కంటికి రెప్పలా కాపాడుకున్న డోన్ నియోజకవర్గంలో ఫ్యాక్షన్ ను ఉసిగొల్పడమే మీ నైజమా? అని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి టీడీపీ అభ్యర్థి కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డిని ప్రశ్నించారు. మండల పరిధిలోని రాచర్ల, బోంచెర్వుపల్లి, కొమ్మేమర్రి, లక్ష్మీతండా, హుసేనాపురం, వెంగళాంపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మంత్రి ఇంటింటి ప్రచారం చేశారు. పలు గ్రామాల్లో రోడ్ షో నిర్వహించి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. గడిచిన కొన్ని దశాబ్దాల పాటు డోన్ నియోజకవర్గం కోట్ల, కేఈ వర్గాల ఫ్యాక్షన్‌తో అట్టుడికి పోయిందన్నారు. 2019 తర్వాత డోన్‌ను కంటికి రెప్పలా కాపాడుకుని ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పి అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లానని చెప్పారు. 15 ఏళ్ల క్రితం డోన్‌ను విడిచివెళ్లిన కోట్ల గత్యంతరం లేని పరిస్థితుల్లో డోన్‌లో టీడీపీ నుంచి పోటీ చేస్తున్న విషయం ప్రజలకు తెలుసన్నారు. నియోజకవర్గంలో అడుగు పెట్టి 15 రోజులు కాకమునుపే ప్యాపిలి, డోన్, బేతంచెర్ల మండలాల్లో టీడీపీ నాయకులే వర్గ పోరుతో పరస్పరం దాడులకు దిగుతున్నారని మంత్రి అన్నారు. డోన్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు దాదాపు రూ. 3 వేల కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని ఆర్థికశాఖ మంత్రి అన్నారు.

చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దు..

ఎన్నికల వేళ అబద్ధాలను వల్లెవేసే చంద్రబాబు నాయుడు మరోసారి తన మోసపూర్తి హామీలతో ప్రజలను మభ్యపెట్టేందుకు సిద్ధమయ్యాడని మంత్రి విమర్శించారు. చంద్రబాబు నాయుడు చెప్పే మాయమాటలు ఎట్టి పరిస్థితుల్లో నమ్మొద్దని మంత్రి ప్రజలకు సూచించారు. గతంలో నెలకు ఒక గ్యాస్ సిలిండర్ ఉచితంగా ఇస్తానన్న చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో గెలిచాక ఆ హామీని తుంగలోకి తొక్కాడన్నారు. నమ్మశక్యం కాని చంద్రబాబు మాటలకు గ్రామాల్లో 'వినేవాడు వెర్రి వాడైతే చెప్పేవాడు చంద్రబాబు నాయుడు' అనే సామెత పుట్టుకొచ్చిందన్నారు.

మీ కుటుంబంలో మంచి జరిగి ఉంటేనే ఓటేయండి..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో అన్ని కుటుంబాలు ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందాయని మంత్రి తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారనే నమ్మకంతోనే 'మీ కుటుంబంలో మంచి జరిగి ఉంటేనే ఓటేయండి' అని ముఖ్యమంత్రి నిజాయితీగా ఓట్లడుగుతున్నారని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్ మేరకే వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో

- చంద్రబాబు అబద్ధాల మేనిఫెస్టోను ప్రజలు నమ్మరు
- గతంలో ఇచ్చిన 600 హామీలను అమలు చేయలేదు
- ఎథిక్స్ కమిటీ చైర్మన్ శిల్పా చక్రపాణిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

బొమ్మలసత్రం: గత ఎన్నికలకు ముందు చంద్రబాబు రాష్ట్రానికి మిగిల్చిన అప్పులు, ప్రస్తుత రాష్ట్ర బడ్జెట్‌ను దృష్టిలో ఉంచుకుని వందకు వందశాతం అమలు చేయగలిగే హామీలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో చేర్చారని శ్రీశైలం ఎమ్మెల్యే, ఎథిక్స్ కమిటీ చైర్మన్ శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన మేనిఫెస్టో ద్వారా ప్రజలకు ఏమైతే చెప్పారో అదే హామీలను 99 శాతం అమలు చేసి చూపించారన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన హామీలే కాకుండా చెప్పని వాటిని కూడా ప్రజలకు అందించారన్నారు. టీడీపీ నేత చంద్రబాబు 2014లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చక పోగా మళ్లీ కొత్త మేనిఫెస్టోతో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారన్నారు. ఎన్నికల లబ్ధి కోసం అబద్ధపు హామీలు ఇచ్చి వారిని మోసం చేయటం వైఎస్ జగన్‌కు నచ్చదన్నారు. టీడీపీ నేతలు గత ఐదేళ్ల జగన్‌పాలనలో ఎప్పుడూ సంక్షేమ పథకాలు నిలిపివేస్తారా అన్న ధోరణితో ఎదురు చూశారని, అయితే మాట తప్పకుండా ఏ పథకాన్ని ఆపకుండా ప్రజలకు లబ్ధి చేకూరేలా చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. ఇన్ని సంక్షేమ పథకాల ద్వారా వైఎస్ జగన్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశాడని ఊదర గొట్టిన చంద్రబాబు అండ్ కో ఇప్పుడు సూపర్ సిక్స్‌తో రాష్ట్రం అప్పులపాలు కాదా అని ప్రశ్నించారు. రైతాంగాన్ని టీడీపీ ప్రభుత్వంలో రుణమాఫీ పేరుతో 2014లో రూ. 74 వేల కోట్లు ఎగరగొట్టి మోసం చేశారన్నారు. డ్వాక్రా మహిళలకు ఎన్ని లక్షల అప్పు ఉన్నా రుణమాఫీ చేస్తానని నమ్మించి రూ. 10 వేలు మాత్రమే ఐదేళ్లు విడతల వారీగా అందించి నమ్మక ద్రోహం చేశారన్నారు. దళితులకు 3 ఎకరాల భూమి అని చెప్పి మూడు సెంట్ల స్థలాన్ని కూడా పంపిణీ చేయలేక పోయాడన్నారు. ఇప్పుడు పింఛన్ రూ. 10 వేలు ఇస్తాన్న ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు శ్రీనివాసరెడ్డి, మధు, బాచం నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజుకు 30 వరకు గడువు

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లింపునకు ఈనెల 30వ తేదీన గడువు ముగుస్తుందని, ఫెయిల్ అయిన విద్యార్థులందరూ తమ కళాశాలలో ఫీజు చెల్లించాలని నంద్యాల జిల్లా ఇంటర్ విద్యాధికారిణి సునీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మే 1 నుంచి 4వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయన్నారు. 5న నైతికత, మానవీయ విలువ పరీక్ష, 6న పర్యావరణ విద్యాపరీక్ష, 7న జరుగుతాయన్నారు. మే 24వ తేదీ నుంచి ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయన్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు. సప్లిమెంటరీ పరీక్ష ఫీజు, రీ వాల్యూయేషన్, రీకౌంటింగ్‌లకు దరఖాస్తు చేసుకునే వారికి గడువు 30తో ముగుస్తుందన్నారు.



సంక్షేమ జెండా

పల్లెల్లో వైఎస్సార్‌సీపీ సంక్షేమ జెండా రెపరెపలాడుతుంది. చీకటి పడినా ఏ మాత్రం అభిమానం తగ్గలేదు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆదివారం రాత్రి ఎం.తిమ్మాపురం గ్రామానికి చేరుకోవడంతో స్థానిక నేత ఒంటెద్దు వీరారెడ్డి ఆధ్వర్యంలో ప్రజలు ఘన స్వాగతం పలికారు.

– మహానంది

క్లుప్తంగా


ఎండలకు బొగ్గుల బోగీలో మంటలు



గూడ్స్ బోగీలో నుంచి వస్తున్న పొగ

చిప్పగిరి: మండలంలోని నేమకల్లు రైల్వే స్టేషన్‌కు ఆదోని వైపు నుంచి బొగ్గుతో వచ్చిన గూడ్స్ రైలు బోగీలో ఆదివారం మంటలు చెలరేగాయి. పొగలు వ్యాపించడంతో గమనించిన రైల్వే సిబ్బంది గూడ్స్ బండిని ఆపి విద్యుత్ తొలగించారు. ఫైరింజన్ సహాయంతో మంటలు ఆర్పివేశారు. అధిక ఉష్ణోగ్రతతో బొగ్గు రాపిడి సంభవించి బొగ్గు బోగీలో మంటలు చెరేగాయని రైల్వే అధికారులు తెలిపారు. రైళ్ల రాకపోకలు యథాతథంగా జరిగాయని పేర్కొన్నారు.

తెర్నేకల్ వైద్యాధికారి ఆత్మహత్య



మృతిచెందిన మెడికల్ ఆఫీసర్ షేక్ అతఉల్లా

బొమ్మలసత్రం: దేవనకొండ మండలం తెర్నేకల్ ఆసుపత్రిలో మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ షేక్ అతఉల్లా (25) ఆత్మహత్యకు పాల్పడ్డారు. తాలుకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల పట్టణంలోని వన్‌టౌన్ పరిధిలోని పోస్టాఫీస్ వద్ద నివాసముంటున్న షేక్ గని అసద్ మొదుదీ పట్టణంలోని రాజ్ థియేటర్ వద్ద సైకిల్‌షాప్ నిర్వహిస్తున్నాడు. షాపు నడుపుతూనే తన కుమారుడు షేక్ అతఉల్లాను ఎంబీబీఎస్ చదివించారు. ఈయన దేవనకొండ మండలం తేర్నెకల్ ఆసుపత్రిలో మెడికల్ ఆఫీసర్‌గా ఇటీవల విధుల్లో చేరారు. ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన డాక్టర్ సాయంత్రం నంద్యాల చిన్న చెరువులో శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి వద్ద లభించిన గుర్తింపు కార్డుల ఆధారంగా కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు గల కారణాలు విచారణలో వెలుగులోకి రానున్నాయి.



ఆదోని టౌన్: ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కొడలిపేట ముస్లింలు



డోన్: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన డోన్ పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్తలు



బనగానపల్లె రూరల్: ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన రామతీర్థం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

చేరికల పర్వం.. విజయంపై నమ్మకం

ఎన్నికల సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతోంది. ఆ పార్టీ నేతలు ప్రజలతో మమేకమవుతూ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. అవినీతికి తావివ్వకుండా ఐదేళ్ల పాటు ఇంటింటికీ అందించిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ ఓటు అభ్యర్థిస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పల్లెలను, పట్టణాలను అభివృద్ధి చేశామని.. మళ్లీ గెలిపిస్తే ప్రగతి పరుగులు పెట్టిస్తామని హామీ ఇస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంపై నమ్మకంతో టీడీపీని వీడి చాలా మంది అధికార పార్టీలో చేరుతున్నారు. జనసేన పార్టీపై విశ్వాసం సన్నగిల్లి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సైతం వైఎస్సార్‌సీపీ కండువాలు వేసుకుంటున్నారు. ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారనే నమ్మకం ప్రతి ఒక్కరిలోనూ కనిపిస్తోంది.

–సాక్షి నెట్‌వర్క్



పాణ్యం: కొండజూటూరులో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు



మద్దికెర: మండలంలో ప్రచారం నిర్వహిస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కనకవీడు పేట టీడీపీ నాయకులు



జూపాడుబంగ్లా: తంగడంచ గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి



ఆలూరు రూరల్: వైఎస్సార్‌సీపీలో చేరిన అరికెర టీడీపీ మాజీ సర్పంచ్ తిరుమలరెడ్డితో పాటు మరికొందరికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న విరూపాక్షి



కోసిగి: ప్రచారంలో భాగంగా కోసిగి మండలంలో ప్రసంగిస్తున్న వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, చిత్రంలో మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



కొత్తపల్లి: గోకవరం గ్రామంలో ఇంటింటి ప్రచారంలో వృద్ధురాలిని ఓటు అడుగుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్



ఆత్మకూరు: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి తనయుడు శిల్పా కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలోకి చేరిన టీడీపీ కార్యకర్తలు



నంద్యాల: వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన 5వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు



సి.బెళగల్: వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్, పార్టీ నేత కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన జనసేన నాయకులు, కార్యకర్తలు

పురుగులు, తెగుళ్లను సకాలంలో నివారించుకోవాలి

- అప్పుడే దిగుబడులు తగ్గకుండా వస్తాయి
- దేశీ శిక్షణా కార్యక్రమంలో ఆత్మ ఏఓ మధుమతి

కర్నూలు(అగ్రికల్చర్): వివిధ పంటలకు సోకే పురుగులు, తెగుళ్లను సకాలంలో నివారించుకుంటేనే మంచి దిగుబడులు పొందే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఏఓ మధుమతి తెలిపారు. చీడపీడల లక్షణాలు, వాటి నివారణ పద్ధతులపై అవగాహన పెంచుకొని రైతులకు చక్కటి సలహాలు ఇవ్వాలని ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. ఆదివారం వ్యవసాయ శాఖ కర్నూలు ఏడీఏ కార్యాలయంలో దేశీ డిప్లొమ కోర్సు కింద ఇన్‌పుట్ డీలర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఏఓ పురుగులు, తెగుళ్ల లక్షణాలు, నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. పురుగులు, తెగుళ్లను నిర్లక్ష్యం చేస్తే పంట నాణ్యత తగ్గి దిగుబడులపై ప్రభావం పడుతుందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సిఫారస్సులతో పురుగుమందులు పిచికారీ చేయాలని సూచించారు. పోషకాల లోపం వల్ల పంటలు దెబ్బతింటే వాటి లోపాలను సవరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విశ్రాంత జేడీఏ, దేశీ కార్యక్రమ సమన్వయకర్త జయచంద్ర వివిధ మండలాల ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి మాలల సంపూర్ణ మద్దతు

- దళితులను విడగొట్టింది చంద్రబాబే
- టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీలకు తీరని ద్రోహం
- రాష్ట్ర జేఏసీ చైర్మన్ కాసారపు వెంకటేష్

కర్నూలు(అర్బన్): సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మాలల సంపూర్ణ మద్దతు ఉంటుందని మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాల సంఘాల జేఏసీ చైర్మన్ కాసారపు వెంకటేష్ అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలుగుదేశం హయాంలో దళితులను గుర్రాలతో తొక్కించి అత్యంత పాశవికంగా దాడులు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. కారంచేడులో మాదిగలను ముక్కలు ముక్కలుగా నరికి గోనెసంచుల్లో కుక్కి కాలువల్లో పడవేశారన్నారు. ఈ ఘటనపై మాదిగలకు అండగా మాలలు దేశ వ్యాప్తంగా ఉద్యమంలో కీలకపాత్ర పోషించారన్నారు. ఈ ఐక్యతను సహించలేని తెలుగుదేశం పార్టీ ఎస్సీలను విభజించిందన్నారు. టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను తొక్కిపెట్టి ఆయా వర్గాలకు చెందిన నిరుద్యోగులకు తీరని ద్రోహం చేసిందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే దళితులపై దాడులు మరింత పెరిగే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో అనేక సంక్షేమ పథకాలు పారదర్శకంగా అర్హులైన దళితులందరికీ అందుతున్నాయన్నారు. విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల నేడు వేల సంఖ్యలో దళిత, గిరిజన బిడ్డలు ఉన్నత విద్యను చదివి మంచి ఉద్యోగాలు పొందుతున్నారన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్ని మారుస్తారని, ఈ అంశంపై దళిత మేధావులు, పెద్దలు జాగ్రతగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు దళిత వర్గాలు మద్దతు పలికి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మహేంద్రబాబు



మహేంద్రబాబును అభినందిస్తున్న జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సంఘం నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర వ్యవసాయ ఉద్యోగుల సేవా సంఘం కార్యవర్గంలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు స్థానం దక్కింది. ఆదివారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఉద్యోగుల సేవా సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు విజయవాడలో ఏకగ్రీవంగా జరిగాయి. నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా పని చేస్తున్న మహేంద్రబాబు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వ్యవసాయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సరీస్ సమస్యలు, పదోన్నతుల సమస్యలు తదితర వాటిని సంఘం నేతల ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికై న మహేంద్రబాబును ఉమ్మడి కర్నూలు జిల్లా జేఏసీ చైర్మన్ వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రవిప్రకాశ్‌రావు, ఎంసీ కాశన్న, టైపిస్ట్, స్టెనోగ్రాఫర్స్ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ శంకర్‌నాయక్ అభినందించారు.

అలగనూరు పాపం చంద్రబాబుదే!

- 2017లో కుంగిన కట్టలు..ఆనాడే భద్రతపై సూచనలు చేసిన నిపుణులు
- అదిగో..ఇదిగో అంటూ పట్టించుకోని టీడీపీ ప్రభుత్వం
- 2021లో రాష్ట్ర ప్రభుత్వం రూ.3.6 కోట్లతో మరమ్మతులు చేయాలని నిర్ణయం
- మరమ్మతులు చేసినా భద్రతపై అనేక అనుమానాలు వ్యక్తం చేసిన నిపుణులు
- నిపుణుల సలహా, సూచనలతో శాశ్వత పనులకు రూ.26 కోట్లతో ప్రతిపాదనలు



కుంగిన అలగనూరు రిజర్వాయర్ రివిట్‌మెంట్



మరమ్మతుల కోసం తవ్విన దృశ్యం



మరమ్మతుల కోసం తొలగించిన రివిట్‌మెంట్

కర్నూలు సిటీ: కేసీ కెనాల్ నీటిని నిల్వ చేసేందుకు ఉన్న ఏకైక రిజర్వాయర్ అలగనూరు. ఈ రిజర్వాయర్ కరకట్టలు 2015 నుంచి కుంగిపోతున్నా అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు పట్టించుకోలేదు. రిజర్వాయర్‌కు మరమ్మతులు చేసి రివిట్‌మెంట్‌ను సరి చేయాలని జల వనరుల శాఖ ఇంజినీర్లు 2017లో సూచించినప్పటికీ కాలయాపన చేశారు. దీంతో రిజర్వాయర్‌పై ఆధారపడిన రైతులు, ప్రజలు సాగు, తాగు నీటికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2021లో రిజర్వాయర్ కరకట్ట పనులు చేసేందుకు రూ.3.60 కోట్లు కేటాయించింది. అయితే ఈ పనులు చేపట్టినా కూడా ప్రయోజనం ఉంటుందా అనే అనుమానాలతో డ్యాం సేఫ్టీ ఇంజినీర్లతో పరిశీలన చేయించింది. రిజర్వాయర్ చుట్టూ మట్టి పటుత్వ పరీక్షలు చేసిన ఇంజినీర్లు.. 2017లోనే మరమ్మతులు చేసి ఉంటే కరకట్ట దెబ్బతినేది కాదని, చుట్టూ ఉండే మట్టి నమూనాల పరీక్షల్లో వచ్చిన ఫలితాల ప్రకారం పూర్తిస్థాయిలో బండ్‌ను తొలగించి కొత్తగా చేపట్టాలని నివేదికలు ఇచ్చారు. ఈ నివేదికల ప్రకారం మొత్తం కట్ట పునాది నుంచి పునఃనిర్మాణానికి రూ.26 కోట్లతో ప్రభుత్వానికి కేసీ ఇంజినీర్లు ప్రతిపాదనలు పంపారు.

నాటి నిర్లక్ష్యమే శాపం

టీడీపీ హయాంలో అలగనూరు రిజర్వాయర్ పనులు చేసింటే కోటి రూపాయలతో పూర్తయ్యేవి. నేడు ఈ ఖర్చు రూ.26 కోట్లకు చేరింది. మిడ్తూరు మండలం అలగనూరు గ్రామం దగ్గర కేసీ కెనాల్ 119 కి.మీ దగ్గర అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ 2.65 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. మొదటగా 2015లోనే కట్ట రివిట్‌మెంట్ కొంత కుంగింది. 2017 నాటికి ఆ రివిట్‌మెంట్ సుమారు 100 మీటర్ల కుంగిపోయింది. ఆనాడే దీనికి మరమ్మతులు చేయాల్సింది. కానీ కేవలం ఇసుక సంచులతో వేసి వదిలేశారు. ఆ రోజు కుంగిన బండ్‌కు మరమ్మతులు చేసి ఉంటే ఈ రోజు సాగు, తాగు నీటిని ఇబ్బంది లేకుండా ఉండేది. నాటి ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఆయకట్టు రైతులు నాలుగేళ్లుగా నీరందక ఇబ్బందులు పడుతున్నారు.

ఫౌండేషన్‌లోనే లోపాలు

కర్నూలు–కడప కాలువ నీటిని తాత్కాలికంగా నిల్వ చేసేందుకు రిజర్వాయర్లు లేవు. తుంగభద్ర నదిలో నీటి లభ్యత తగ్గిపోతుండడంతో రబీ సీజన్‌లో చివరి ఆయకట్టుకు సాగు నీరు, తాగు నీటికి కోసం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో చివరి ఆయకట్టుకు స్థిరీకరించేందుకు ఓ రిజర్వాయర్ నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. 1985 సంవత్సరంలో అలగనూరు రిజర్వాయర్ రూ.3.06 కోట్లకు కేవలం పరిపాలన ఆమోదం తెలుపుతూ జీఓ ఎం.ఎస్ నెంబరు 327 జారీ చేశారు. అయితే ఆ తరువాత 1993 వరకు ఎవరూ పట్టించుకోలేదు. ఈ సమయంలో కేసీ కెనల్‌ను జైకా నిధులతో ఆధునీకరించే పనుల్లో భాగంగా రూ.59.90 కోట్లతో రిజర్వాయర్‌ను చేపట్టారు. పనులు ఆలస్యమై 2004లో పూర్తయ్యాయి. కోర్టు కేసుల కారణంగా ఎర్త్ బండ్ చాలా కాలం పాటు ఆగిపోవడం, లోతైన కొండగట్టు పోర్షన్‌లో నేల స్థాయి కంటే తక్కువ పొరల కుదింపు జరుగలేదు. ఈ రిజర్వాయర్ పనులు జరుగుతున్న సమయంలో గడివేముల నుంచి రోళ్ళపాడు గ్రామానికి వెళ్లేందుకు ఉన్న రోడ్డును తొలగించకుండా, ఎలాంటి ట్రెంచెస్ వేయకుండానే నిర్మాణం చేపట్టారనే విమర్శలు ఉన్నాయి. నిపుణుల కమిటీ సైతం ఇదే అనుమానాన్ని వ్యక్తం చేసింది. రోడ్డు ఉన్న ప్రాంతం, గతంలో ఇక్కడ ఉండే చెరువులోకి నీరు వచ్చేందుకు ఉండే వాగు మట్టిని తొలగించకపోవడంతోనే బండ్ కుంగిందని తెలుస్తోంది. రిజర్వాయర్ రిజర్వాయర్ లోపల వైపునకు 2.5 కి.మీ నుంచి 2.65 కి.మీ, 2.75 నుంచి 2.85 కి.మీ, 2.9 కి.మీ నుంచి 3.00 కి.మీ, 3.15 నుంచి 3.25 కి.మీ వరకు, పైభాగంలో 2.65 కి.మీ నుంచి 2.75 కి.మీ వరకు బండ్ కుంగింది. దిగువ భాగంలో కూడా కొన్ని చోట్ల నీరు సీపేజ్ అవుతున్నట్లు కూడా గుర్తించారు. కింది స్థాయి నుంచి బండ్‌ను బలోపేతం చేయనున్నారు.